క్లుప్తంగా

చట్టాలపై అవగాహన

నూజివీడు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. కోటవారిగూడెం హైస్కూల్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బాలల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



తిరువూరు: స్థానిక రాజుపేట సీతామహాలక్ష్మీ కాలనీ, బైపాస్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాలను తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బైపాస్ రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటల వరకు పిల్లల హాజరు నమోదు చేయకపోవడం, మధ్యాహ్నం మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 మంది పిల్లలకు ముగ్గురే హాజరవడంపై కార్యకర్తను మందలించారు. కేంద్రంలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, గదులు బూజు పట్టి అధ్వానంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సీడీపీఓ సత్యవతి పాల్గొన్నారు.

గృహాలకు సోలార్ విద్యుత్ లక్ష్యం

నూజివీడు: ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోందని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ మురళీమోహన్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలోని ఆడిటోరియంలో నూజివీడు డివిజన్‌లోని విద్యుత్ శాఖ సిబ్బందికి పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ఈ పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వారిలో అవగాహన పెంపొందించాలని సూచించారు.

ఎన్‌సీడీ సర్వే ప్రారంభం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్) సర్వే మూలపాడు గ్రామంలో ప్రారంభమైంది. సర్వేను ఆరోగ్య శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు గురువారం ప్రారంభించారు. సర్వే ద్వారా ప్రతి కుటుంబానికి చెందిన సభ్యుల పూర్తి ఆరోగ్య వివరాలు, వ్యాధులు, తీసుకుంటున్న చికిత్స తదితర అంశాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రానున్న తొమ్మిది నెలల కాలంలో ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వీన్, జిల్లా ఎన్ఎస్‌డీ పరిశీలకులు డాక్టర్ విజయ, సీహెచ్‌ఓ నారాయణ, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మైలవరం విద్యార్థులు



మైలవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు పి. సిద్దు (ఇప్పి), కె. ఇబ్రహీం ఖలీల్ (శాబర్), బి. చరణ్ (శాబర్), బి. మౌనిక (శాబర్), ఎస్ దీప్తి (శాబర్), కె.పూజ(ఇప్పి), ఎం.శాంతిప్రియ (పాయల్) ఎ. రంగమ్మ (పాయల్) విభాగాల్లో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.కనకదుర్గ గురువారం తెలిపారు. ఈ నెల 13న విజయవాడ కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్ 19 ఫెన్సింగ్ పోటీల్లో వీరు ప్రతిభ చూపి ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 26 నుంచి నంద్యాలలో జరుగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కె. వెంకయ్యను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థినులకు అభినందన

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పలు పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నందుకు గురువారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అండర్ 17 విభాగంలో చదరంగం పోటీకి ఎంపికైన షేక్ సమీనా, హైజంప్‌లో ఎంపికైన కె. జాహ్నవి, బేస్ బాల్‌కు ఎంపికైన కె. మౌనశ్రీ, సాఫ్ట్‌బాల్ పోటీలో గెలుపొందిన బి. కావ్యశ్రీ, అండర్14 విభాగంలో త్రోబాల్‌కు ఎంపికైన ఎం. మయూరిలను ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాటర్ ప్యూరిఫయర్ ప్రారంభం

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, సేవలందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని గంపలగూడెం ఎంఈఓ నరసింహారావు అన్నారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1973–74 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులచే ఏర్పాటు చేసిన రూ. 75 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను ఆయన ప్రారంభించారు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

- ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం
- ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారులతో నష్టపోతున్న రైతులు
- మద్దతు ధర పెంచాలని డిమాండ్

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రారంభంలో అధిక వర్షాలు, కృష్ణానది, బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో పంట పొలాలు నీట మునిగాయి. సాగు చివరికి వచ్చేసరికి అల్పపీడన ప్రభావం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,300 ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. వరి కోతలు కోసిన రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు.



త్రిలోచనాపురంలో వరిపంట కోస్తున్న వరి కోత యంత్రం

ఇబ్రహీంపట్నం: మండలంలో ఈ ఏడాది 4,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రారంభంలో వచ్చిన వరదలకు ముంపునకు గురై నష్టపోగా మిగిలిన 1,750 ఎకరాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా సాగు చేసిన జూపూడి, మూలపాడు, త్రిలోచనాపురం గ్రామాల్లో ఇప్పటికే సుమారు 50 ఎకరాల్లో యంత్రాలతో కోతలు కోశారు. వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2,300 ప్రకటించింది. రైతు సేవా కేంద్రాలకు ధాన్యం కొనుగోలుపై ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారి నిబంధనలు చూసి రైతులు ఆసక్తి చూపడంలేదు. దళారులను ఆశ్రయించి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఈ ఏడాది వచ్చిన వరదలకు గింజ గట్టి పడలేదని, రంగు మారిందనే సాకుతో బస్తా ధర కేవలం రూ.1,600 నుంచి రూ.2 వేలు మధ్య దళారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.300 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారు.

ఎకరాకు 10 బస్తాల వరకు తగ్గుదల

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగులో పెట్టుబడులు భారీగా పెరిగాయని రైతులు చెబుతున్నారు. అధిక వర్షాలు, వరదల ప్రభావంతో దిగుబడి ఎకరాకు సుమారు 10 బస్తాల వరకు తగ్గాయి. గత ఏడాది సాంబమసూరి రకం ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి అయింది. ఈ ఏడాది 20 నుంచి 25 బస్తాలు మాత్రమే వస్తోంది. 1262 రకం గత ఏడాది 35 నుంచి 45 బస్తాల మధ్యలో దిగుబడి ఇచ్చింది. ఈ ఏడాది 30 నుంచి 35 బస్తాలకు పడిపోయింది. వరదల ప్రభావానికి గురైన పంటను కాపాడుకునేందుకు ఈ ఏడాది అధికంగా ఖర్చు చేశారు. ఎకరాకు దుక్కి, దమ్ము రూ.4వేలు, నారు రూ.2 వేలు, నాటు కూలీల ఖర్చు రూ. 4,500, ఎరువులు రూ.6 వేలు, కూలీల ఖర్చు రూ.2 వేలు, పురుగు, గడ్డి మందు, కూలీలు రూ. 5 వేలు, కలుపు రూ.2 వేలు, వరికోత యంత్రం ఖర్చు రూ. 5 వేలు మొత్తం రూ.30,500 వరకు రైతులు ఖర్చు చేశారు. కౌలుదారులు ఎకరాకు 10 బస్తాలు పొలం యజమానికి చెల్లించాలి. 10 బస్తాలు పోగా సాంబ మసూరిలో రైతుకు మిగిలేది 10 నుంచి 15 బస్తాలు. యావరేజ్‌గా 12 బస్తాలు వేసుకున్నా రూ.2వేలు చొప్పున రైతుకు మిగిలేది రూ.24 వేలు. ఖర్చులు పోగా దాదాపు రూ.6,500వరకు నష్టపోతున్నాడు.

రైతు సేవా కేంద్రాల ప్రమేయం లేకుండానే..

ఈ ఏడాది రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ బయటి మార్కెట్‌లో కూడా అమ్ముకోవచ్చని వెసులుబాటు కల్పించింది. ఇందుకు గాను రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ భూముల సర్వే నంబర్లతో వివరాలు తెలియజేయాలని నిబంధన విధించింది. ఈ విధానం ద్వారా మిల్లర్లు, దళారులు రైతుల వద్ద అతి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించే అవకాశం కల్పించినట్లయింది. ఈ విధానంతో మన రాష్ట్ర సంపద పొరుగు రాష్ట్రాలకు దళారుల ద్వారా తరలిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర రూ.3 వేలకు పెంచాలి



మూడెకరాలు వరిసాగు చేశా. కృష్ణానది వరదకు పంటంతా నీటి ముంపునకు గురైంది. ఖర్చులు అధికంగా పెట్టాల్సి వచ్చింది. దిగుబడి 20 బస్తాలకు మించేలా లేదు. దళారుల వద్ద బస్తా ధర రూ.1,800 ఉంది. ప్రభుత్వం ఇంకా ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించలేదు. ప్రభుత్వ ధర రూ.2,300 అంటున్నారు. ఈ ఏడాది కనీసం రూ.3 వేలు వరకు పెంచాలని కోరుతున్నాను.

– జొన్నలగడ్డ సాంబశివరావు, రైతు, మూలపాడు

అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

మైలవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ అనూరాధ అన్నారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులలో పెద్ద పంచాయతీలు 60 శాతం శానిటేషన్ పనులకు, 30 శాతం ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు, మిగిలిన 10 శాతం నిధులు ఇతర డిపార్ట్‌మెంటల్ పనులకు వినియోగించాలన్నారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ పనులు చేపట్టి ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఈఓపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

- **జి.కొండూరు(మైలవరం):** అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్‌గా మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్‌గా విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- **ముసునూరు:** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఈఓపీఆర్డీ బీవీ సత్యనారాయణ అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికల సర్దుబాటుపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఏఓ చాయాదేవి, సీనియర్ సహాయకుడు సగ్గుర్తి శ్రీనివాసరావు గ్రామాభివృద్ధిలో ప్రణాళికల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని ధర్నా



తిరువూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

తిరువూరు: విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో దొడ్డిదారిన వినియోగదారులపై భారం విధించడం తగదన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సగటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం మరింత భారం మోపాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

- **ఎ.కొండూరు:** నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలపై మోయలేని భారాలు మోపేందుకు సిద్ధమైందని విమర్శించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నూజివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టాక రోజురోజుకు ధరల భారం పెరిగిపోయిందన్నారు. వరద ప్రభావంతో నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నివశిస్తున్న పేదలకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఈలప్రోలు జగనన్న కాలనీ మున్సిపాల్టీ పరిధిలో మ్యాపింగ్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్‌లు విడుదల చేయాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.
- **మైలవరం:** రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సీపీఎం సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు మాట్లాడారు. తహసీల్దార్ సుశీలాదేవికి వినతి పత్రం అందజేశారు.
- **ఆగిరిపల్లి:** సీపీఎం మండల కార్యదర్శి శివ నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

అదనపు భవనాలకు శంకుస్థాపన



అదనపు భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.40 కోట్లతో నిర్మించనున్న అదనపు భవనాలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద విద్యార్థుల కోసం ఉచిత విద్య, ఉపకార వేతనాలు, పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ వెంకటేశ్వరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.కొండూరు: కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న జోన్-2 బాలుర ఆటల పోటీలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల గురుకులాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, పరుగుపందెంతో పాటు 20 రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ కె. సిద్దయ్య, జాయింట్ సెక్రటరీ కె. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



మైలవరం సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

నూజివీడు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎంఈఓ వంగల గోవిందరావు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, కవి శిఖా ఆకాష్, రాజారామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను సబ్ రిజిస్ట్రార్ యార్లగడ్డ నరసింహారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోయ సుధతో కలిసి ప్రారంభించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **తిరువూరు:** గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ప్రారంభించారు. నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ వెంకటేశ్వరి, ఎంఈఓ రామకృష్ణ, తెలుగు వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **గంపలగూడెం:** విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతి రోజు గ్రంథాలయాలకు వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలు, పత్రికలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ అన్నారు. గంపలగూడెం, పెనుగొలను శాఖా గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గంపలగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, పెనుగొలనులో సర్పంచ్ సంగెపు లలిత జాతీయ జెండాలను ఆవిష్కరించారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి ప్రారంభించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓలు సర్వేశ్వరరావు, కొవ్వలి ఆనంద్‌కుమార్, గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేశానికి నెహ్రూ సేవలు మరువలేనివి

జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి

తిరువూరు: స్వాతంత్ర్యానంతర భారతదేశాభివృద్ధికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన కృషి మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ తిరువూరు మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రాజీవ్ భవన్‌లో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి నెహ్రూ వేసిన పునాదుల పైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని శ్రీనివాసరావు అన్నారు. బ్లాక్, పట్టణ పార్టీ అధ్యక్షులు బొడ్డు ప్రకాశరావు, జీవన్‌బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- **మైలవరం:** మాజీ ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మాదాల బుల్లయ్య బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక వివేకానంద హైస్కూల్ విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మైలవరం ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ ఎల్.బాలు, హెచ్ఎం పీ.గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

మైలవరం: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న షాపులపై గురువారం దాడులు జరిపారు. జి.కొండూరు మండలం గడ్డమణుగు గ్రామానికి చెందిన ఎర్రగుంట శాంత అనధికారికంగా మద్యం అమ్ముతుండగా అరెస్టు చేసి ఆమె నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు పాత ముద్దాయిలను జి.కొండూరు తహసీల్దార్ ఎదుట హాజరు పర్చి బైండోవర్ చేశారు. మైలవరంలో మరో ముగ్గురు ముద్దాయిలను మైలవరం తహసీల్దార్ వద్ద హాజరు పర్చి బైండోవర్ చేశారు.

కార్తిక స్నానాలకు ఏర్పాట్లు శూన్యం

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వద్ద కార్తిక పుణ్యస్నానాలకు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయలేదు. కార్తిక మాసంలో వచ్చే పౌర్ణమికి ప్రతి ఏడాది పవిత్ర సంగమం వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వేలల్లో భక్తులు తరలి వస్తుంటారు. పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలోని దేవాలయాల్లో పూజలు చేసుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది సంగమం వద్ద గురువారం రాత్రి వరకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. మహిళలు స్నానాలు చేసి బట్టలు మార్చుకునేందుకు ఓ టెంట్ కూడా వేయలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులను రాత్రి సమయంలో పంపిస్తానని చెప్పినట్లు తెలిసింది.

ఘనంగా బాలల దినోత్సవం



జి.కొండూరులో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

ఇబ్రహీంపట్నం: భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ కార్యక్రమం వివిధ గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శిఖినం శ్రీనివాసరావు, పవన్‌కుమార్ 150 మందికి మధ్యాహ్న భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కాచవరం ఎంపీపీ పాఠశాల, కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల, క్రాంతి హైస్కూల్‌లో సాంస్కృతిక, క్రీడా పోటీలతో విద్యార్థులు అలరించారు.

- **చాట్రాయి:** మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మర్లపాలెం హైస్కూల్, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల, చనుబండ గ్రంథాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **జి.కొండూరు(మైలవరం):** బాలల హక్కులు కాపాడుకుందామని ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు బట్టపర్తి రాజు తెలిపారు. జి.కొండూరులోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా గుంటూరు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీలత పాల్గొన్నారు.
- **జి.కొండూరు:** విద్యార్థులు బాగా చదువుకుని తమ గ్రామాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయం, వివేకానంద స్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ మండల అరుణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, బురసు శివ పాల్గొన్నారు.
- **ఎ.కొండూరు:** చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, పోలిశెట్టిపాడు తదితర గ్రామాల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.
- **లక్ష్మీపురం(తిరువూరురూరల్):** లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ రామకృష్ణ, హెచ్ఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎస్ఎంసీ చైర్మన్ బావిశెట్టి వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పొట్లూరి రాధికా రాణి, పీడీ రవీంద్ర పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ సీడీపీఓ నూరాని పాల్గొని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆగిరిపల్లి డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.
- **ముసునూరు:** లోపూడి ఆశ్చర్య పాఠశాలలో జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. రమణక్కపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బాబు పాల్గొన్నారు. గోపవరం శాఖా గ్రంథాలయాధికారి జె.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. నూజివీడులోని గిఫర్డ్ మెమోరియల్ హాస్పటల్(జీఎంహెచ్)లో హాస్పటల్‌లోని చిన్నారులకు వైద్య పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు అందించారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

పీఏసీఎస్ సేవలు వినియోగించుకోవాలి

సత్యాలపాడు(గంపలగూడెం): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా అందజేస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని సంఘం పర్సన్ ఇంచార్జ్ కనకదుర్గ అన్నారు. సత్యాలపాడు పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలను ప్రారంభించారు. సంఘ సీఈఓ రామకృష్ణ, ఎన్‌సీయూఐ ప్రతినిధి అనంద్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- **ఎ.కొండూరు:** ఎ.కొండూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార పతాకాన్ని సీఈఓ ఎన్. నరసింహారావు ఆవిష్కరించారు.